# పరిష్కారం

కొకర్లమూడి జ్యోతీ మోహన్


''సురేఖ పరిస్థితి ఏమీ బాగాలేదు. నువ్వు పిన్ని వచ్చి మా దగ్గర నాలుగు రోజులుంటే బాగుంటుంది.'' అని రఘు రాసిన ఉత్తరం చూసి, ఇద్దరం బయలుదేరే వీలు లేదని పనులు మా ఆవిడకి అప్పచెప్పి, హైదరాబాదు బండెక్కేసరికి ఎంత లేదన్నా, పదిరోజులు పట్టింది. రఘు నా అన్నయ్య కొడుకు. అన్నయ్య, వదిన ట్రైన్ ఏక్సిడెంట్‌లో పోయేసరికి వాళ్ల పిల్లలు పెద్దవాళ్లయినా, వాళ్ళ పెళ్ళిళ్లు పురుళ్ళు మేమే చూశాము. అందరి కంటే ఆఖరి వాడు రఘుకి నాదగ్గర చనువెక్కువ. సురేఖ వాడి భార్య.



పొద్దున్నే తలుపుతట్టిన నన్ను చూసి ఆనందంతో కౌగిలించుకున్నాడు రఘు. మనవలిద్దరూ వదలకుండా ఒకటే కబుర్లు. హడావిడి పడుతూ పలకరించింది సురేఖ. పైకి బాగానే ఉన్నట్టున్నా తరచి చూస్తే కళ్ళకింద నల్లని వలయాలు కనిపిస్తున్నాయి. కొంచెం చిక్కినట్టుగా కూడా అనిపించింది. నాకు కాఫీ, టిఫిను ఇచ్చి పిల్లలను రెడీ చెయ్యడం మొదలుపెట్టింది. అప్పట్నుంచీ ఏదో మార్పు కనిపించింది ఆమెలో. సర్దిన సామాన్లే సర్దుతోంది. చెప్పిన జాగ్రత్తలే మళ్లీ మళ్లీ చెపుతోంది. పిల్లలెక్కడో దూరంగా వెళుతున్నట్టు. పెద్దవాడు సుమంత్-టెంత్. రెండోవాడు హేమంత్ సెవెంత్ చదువుతున్నారు ఒకే స్కూల్లో. వాళ్ల పుస్తకాలు, లంచ్ బాక్సులు వాళ్లే సర్దుకోగలరు. అయినా మళ్లీమళ్లీ చెక్‌చేస్తోంది. చెమట్లు తుడుచుకుంటూ ఒకటే హైరాన పడుతోంది. పిల్లలు దానికి అలవాటుపడినట్టుగా అలాగేనమ్మా, సరేనమ్మా అని ఓపిగ్గా సమాధానాలు చెపుతున్నారు. స్కూలు బస్సు వరకూ తనే దింపి వస్తానని బయల్దేరింది. తను అటు వెళ్లగానే గబగబా చెప్పాడు రఘు. ''చూశావుగా బాబాయ్! చాదస్తురాలిలా తయారవుతోంది రోజురోజుకి. పిల్లల జబ్బలకి చూశావుగా ఎన్ని తాళ్ళూ, తాయెత్తులూ కట్టిందో. పిల్లలని స్కూల్‌కి పంపి వాళ్లు వచ్చేవరకూ ఒకటే టెన్షన్‌పడుతుంది. నేను ఆఫీసు నుంచి వచ్చేవరకూ కూడా టెన్షనే. అందరమూ వచ్చాక ఇక వెర్రిగా ఆనందపడుతుంది. పిల్లలనీ అతి ముద్దుచేసి విసిగిస్తుంది. ఆటలకి కూడా బయటికి పంపట్లేదు. పబ్లిక్ పరీక్షలు కదా అని పిల్లలు కూడా ఇంటిపట్టునే ఉండి చదువుతున్నార్లే. కానీ ఎన్నాళ్లిలా! రోజురోజుకీ ఈ వింత ప్రవర్తన పెరుగుతోందే గానీ తగ్గడం లేదు. పూజ కూడా గంటల తరబడి చేస్తున్నట్టుగా అనుమానంగా వుంది.'' అన్నాడు.

''ఏదైనా డాక్టరుకి చూపించలేక పోయావా?'' అడిగాను.

''అదీ అయింది. జనరల్ ఫిజీషియన్ కొద్దిగా హైబిపి ఉందని




మందులిచ్చారు. గైనకాలజిస్టు హార్మోన్ల మార్పు అంటూ వేరే మందులిచ్చారు. సైకియాట్రిస్టు 'సున్నిత మనస్కురాలు,పెరుగుతున్న బాధ్యతల పట్ల అతిగా స్పందిస్తోంది.' అని టెన్షన్ తగ్గడానికి టాబ్లెట్లు వాడమన్నారు. వాటితో ఒకటే నిద్ర. నిద్ర లేచాక ఒకటే కంగారు. అందరూ టైము పడుతుంది తగ్గడానికి అనే వాళ్లే.'' అంటూ తలపట్టుకున్నాడు రఘు.

''ధ్యానం అనీ, యోగా అనీ కోర్సులు చేయించాను. ఈమధ్య పూజలూ, పునస్కారాలు, బాబాలు అంటూ వాటిమీద పడింది.'' ఇంకా ఏదో చెప్పబోతున్న రఘు ఆగిపోయాడు సురేఖ రావడంతో. ఎందుకో ఏడ్చినట్టుగా ఉంది ఆమె ముఖం. తరచి తరచి అడగ్గా కారణం చెప్పింది. రోజూ వచ్చే డ్రైవరు కాక కొత్తవాడు వచ్చాడట. 'వాడు సరిగా తీసుకెళతాడో లేదో అని భయంగా ఉంది' అంటూ మళ్లీ కళ్లు తుడుచుకుంది. ''నీ పిల్లలిద్దరే కాక ఇంకో నలభైమంది పిల్లలూ, టీచర్లూ ఉంటారుగా'' అని ఊరుకోబెట్టబోయాడు రఘు.

''అవునండీ. వాళ్లందరికీ ఏదయినా అయితే ఎన్ని కుటుంబాలు క్షోభపడతాయి? ఎంతమందికి కడుపుకోత?'' అంటూ మళ్లీ మొదలుపెట్టింది. అలా ఆలోచిస్తే ఎలా? అంతా మంచిగా అవుతుందని ఎందుకనుకోవు?'' కొద్దిగా విసుగ్గా అని ఆఫీసుకి బయల్దేరాడు రఘు. వాడిని బస్సెక్కించడానికి నేను వెళ్లి ''నాలుగు రోజులు టైమివ్వరా రఘూ! అసలు కారణం కనుక్కుని నెమ్మదిగా పరిష్కారం ఆలోచిస్తాను.'' అన్నాను అనునయంగా.

''అంతకన్నానా బాబాయ్! నువ్వు రాగానే కొండంత ధైర్యం వచ్చింది. సురేఖని మళ్లీ మామూలుగా చేసే బాధ్యత నీదే!'' అనేసి కంపెనీ బస్ ఎక్కాడు రఘు.

ఓ నాలుగు రోజులు ఎక్కడికీ కదలకుండా సురేఖనే గమనించాను నేను. తనతోనే ఎక్కువగా మాట్లాడుతూ వెనకాల వెనకాలే తిరిగాను. ఈ నాలుగురోజులూ రెండుమూడు రకాల న్యూస్ పేపర్లు క్షుణ్ణంగా చదివాను. సిటీ ఎడిషన్‌లో న్యూస్ చదువుతుంటే నాకే ఒళ్లు జలదరించింది. రోజుకి నాలుగు తక్కువ కాకుండా ఏక్సిడెంట్ మరణాలు, ఓ నాలుగు వరకట్నం హత్యలు, ఓ రెండు ఆత్మహత్యలు, విద్యార్థులు, ప్రేమికుల ఆత్మహత్య ప్రయత్నాలు, అత్యాచారాలు ఇవికాక మతోన్మాదుల కిరాతక చర్యలూ, అరవయ్యోపడిలోపడ్డా మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటాను అనిపించుకునే నేనే కలవరపడ్డాను. ఇక సురేఖలాంటి దుర్బల మనస్కురాలి పరిస్థితి ఇలా అవడంలో ఆశ్చర్యం లేదనిపించింది. ఇక టివి సీరియళ్లు, వాటి నాణ్యత చెప్పేదేముంది? ఆమధ్య వరసగా స్కూల్‌కెళ్లే పిల్లలు రోడ్ ఏక్సిడెంట్స్‌లో చనిపోయారుట. అప్పటినుంచీ 'మరీ గాభరాగా ఉంటోంది మావయ్యగారూ!' అని ఒకటే ఏడ్చింది సురేఖ.

ఆమె ఇంట్లో ఉండగానే తల్లి కేన్సర్‌తో పోయింది. ఆ బాధ భరించలేక తాగి, తాగి తండ్రిపోయాడు. ఇటు రఘు తల్లిదండ్రులదీ బలవన్మరణమే. ఆరునెలల క్రితం సురేఖ అన్నగారికి స్కూటర్ ఏక్సిడెంటయి కాలు విరిగిందిట. దూరపు బంధువులు మూడునెలల క్రితమే టాటా సుమోలో తిరుపతి వెళ్లి వస్తూ ఏక్సిడెంటయి మొత్తం కుటుంబం నామరూపాలు లేకుండా మాడిపోయారుట. ఇవన్నీ ఒక్కొక్కటిగా సమాచారం సేకరించుకుంటూ విశ్లేషణ చేసుకుంటూ నాకున్న పరిధిలో నేను పరిష్కారాలు ఆలోచించడం మొదలు పెట్టాను. సరిగ్గా పదిరోజుల తర్వాత కుటుంబ సభ్యులందరినీ సమావేశపరిచాను.

''రఘూ! కాలం వేగంగా మారిపోతోంది. సౌకర్యాలు, విలాసాలే కాక జబ్బులూ, ప్రమాదాలూ కూడా అతివేగంగా పెరుగుతున్నాయి. అనురాగాలు, అభిమానాలు తగ్గి, ద్వేషం అసూయ పెరుగుతున్నాయి. అందరమూ మారేకాలానికి అనుగుణంగా మారవలసివస్తోంది. మారుతున్నాం కూడా. సురేఖలాంటి వాళ్లు తప్ప. మన సురేఖలాంటి సున్నిత మనస్కురాలు, ప్రేమమయి ఈ కాలంలో ఉండదగ్గది కాదు.''

ఒక్కక్షణం ఆగాను. అంతా నాకేసి వింతగా చూస్తున్నారు. ''అవును. సురేఖ పరిస్థితి శాస్త్ర పరిభాషలో చెప్పాలంటే 'ఫోబియా' అని తేల్చిపారేస్తాం. కానీ చిన్నతనంలోనే కష్టాలు, కన్నీళ్లు చూసినా అధైర్యపడలేదు ఆమె. అందరినీ సంతోషపరచడానికే ప్రయత్నించేది. తనకొచ్చేవే కష్టాలు ఇతరులు అనుభవించేవి సుఖాలు అనుకునే వారి కోవకు రాదు సురేఖ. ఎవరికి ఏ కష్టం వచ్చినా తల్లడిల్లిపోతుంది ఆమె మనసు. వారి స్థానంలో తనని ఊహించుకుని నరకం అనుభవిస్తుంది. ఈమధ్య విపరీతంగా పెరిగిన ట్రాఫిక్ మరణాలు ఆమె మనసుని మరీ కుంగదీశాయి. దీనిని ఎదుర్కోడానికి ఆమె అవలంబించిన పద్ధతే పూజలూ, వ్రతాలూ, తాయెత్తులూ.. ఆఖరికి ఇది ఎంతవరకూ వచ్చిందంటే చిన్నచిన్న బొమ్మకార్లు, లారీలు, ఆటోలు దేవుడి గూట్లో పెట్టుకుని 'ఆ వాహన దేవుళ్ళ'కి పూజలు చేయడం వరకూ..'' ఎర్రబడ్డ సురేఖ ముఖం చూస్తూ ''తప్పేం లేదమ్మా! చిన్నప్పుడు పొలాల గట్లమ్మట తిరిగే మాకు పాములు, పురుగూ పుట్రల వల్ల ప్రమాదం వుండని ప్రతీ నాగుల చవితికీ మా అమ్మ పుట్టలో పాలు పోయించి 'నాగన్నా! చీకట్లో పసివాళ్లు నీతోక తొక్కితే తనవాడనుకో, నడుం తొక్కితే నావాడనుకో' అని దణ్ణం పెట్టి, పుట్టమన్ను బొట్టుపెట్టేది. అయినా ఏడాదికో రెండేళ్ళకో ఒకరో ఇద్దరో పాము కాటుకి గుర్రై పసరుమందుకి లొంగక చనిపోతుండేవారు. ఇక అమ్మవారి జాతర్లు, తిరనాళ్లు, పానకాలు పోయడాలు, మంత్రాలు, తంత్రా ఉండనే ఉండేవి. ఇవన్నీ మాన చేతుల్లో లేని దాన్ని భగవంతునిపై భారం వేయడానికి చేసే ప్రయత్నాలు. దేవుడా! నీదే భారం అని కలిసికట్టుగా ప్రార్థించి ఆ

ఐకమత్యంలోంచి, ప్రార్థనలోంచి ఒక నమ్మకాన్ని, ధైర్యాన్ని పొందే ప్రయత్నం. ఎవరితోనూ తన భయాన్ని, బాధని పంచుకోలేని సురేఖ తనలో తనే కుమిలిపోతోంది. మీరు బయటినించి తిరిగి వచ్చే దాకా విపరీతమైన వ్యథ. తిరిగి వచ్చాక వెర్రి ఆనందం. ఇలా ప్రతీక్షణం నరకం అనుభవిస్తోంది.'' తన బాధని అర్థం చేసుకునేవారు దొరికినందుకు సురేఖ కళ్లు నిర్విరామంగా వర్షిస్తున్నాయి.

తనని ఇందులోంచి బయటపడెయ్యడానికి ఒక మార్గం ఆలోచించాను. అది ఎంతవరకూ ఫలిస్తుందో తెలియదు. మన ప్రయత్నం మనం చెయ్యడంలో తప్పేముంది?'' కొంచెం ఆగాను.

''చెప్పండి తాతగారూ! అమ్మకోసం మేమేమైనా చేస్తాం.'' కొంచెం ఉద్వేగంగా, ఉత్సాహంగా అన్నాడు రెండో వాడు. సురేఖ కళ్లు తుడుచుకుంటూ వాడి తల నిమిరింది. నెమ్మదిగా నా ప్రణాళిక వివరించాను. కొంచెం గుంజాటన పడ్డా అందరూ ఒప్పుకున్నారు.

రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో వున్న విశాలమైన తమ అపార్ట్‌మెంట్‌ని అద్దెకిచ్చాడు రఘు. అందులో సగం అద్దె పెట్టి దూరంగా విసిరేసిట్టుగా ఉన్న కొత్త కాలనీలో ఇండిపెండెంట్ ఇల్లు అద్దెకి తీసుకున్నాడు. చుట్టూ పూలమొక్కలు నాటాం నేనూ, సురేఖ. ఇంతలో ఊర్లో పనులు చక్కబెట్టుకుని, జంతికలు, సున్నుండలతో సహా వచ్చివాలింది మా ఆవిడ. అంతగా జనం పెరగని ఆ కాలనీలో వాహనాల రొద వినిపించమన్నా వినిపించదు. పెద్దవాడు స్కూలు మారనన్నాడు. అందుకే వాడిని హాస్టల్లో వేశాం. రెండోవాడికి కాలనీలో కొత్తగా పెట్టిన కాన్వెంట్‌లో పిలిచి మరీ సీటు ఇచ్చారు. నడిచి వెళ్లి వచ్చేంత దూరంలో ఉన్నా, కొంతకాలం సురేఖను కూడా పంపించాం స్కూల్లో దింపడానికి, తీసుకురావడానికి. రోజూ పెద్దాడు ఫోన్‌లో వాళ్లమ్మతో మాటాడేటట్టూ, రెండు వారాలకి ఒకసారి సురేఖ, రఘు వెళ్లి వాడిని చూసి వచ్చేటట్టూ ఒప్పందం అయింది. పిల్లలకి కట్టిన తాళ్ళూ, తాయెత్తులూ తీసి పచ్చని చెట్టుమీద వేసింది మా ఆవిడ. 'ఇక అవసరం లేదమ్మా! కీడంతా పోయింది.' అని సురేఖకి నచ్చచెపుతూ. రుచిగా వండి పెడుతూ, కొసరి కొసరి తినిపిస్తూ తల్లిదీవెన ఎంతోమంచిదనీ అన్నివేళలా మంచిగా ఆలోచించడానికే మన వాళ్ళు తథాస్తు దేవతల వంక పెట్టారని మా ఆవిడ కూడా తన వంతు కౌన్సిలింగ్ చేసింది.

సురేఖకి రెండు ఆప్షన్స్ ఇచ్చాను. ఒకటి - హేమంత్ స్కూల్లోనే టీచరుగా పనిచేయడం, రెండు- దగ్గర్లోనే వృద్ధాశ్రమం నడుపుతున్న సేవా సంస్థకు క్లర్కుగా పనిచేయడం. రెండిట్లో జీతం నామమాత్రం కానీ బోలెడు వ్యాపకం. సురేఖ మొదటిది కోరుకుంటుందేమో అనుకున్నా, గానీ రెండోదే ఇష్టపడింది ఆమె.

ఓ మూడు నెలలపాటు న్యూస్ పేపరు, టివి, అన్నీ బంద్ చేశాను. ఆ తర్వాత కూడా సురేఖ ఇష్టపడి, తట్టుకోగలిగే శక్తి వచ్చాకే వాటి ప్రవేశం. హేమంత్ కార్టూన్ ఛానల్‌కోసం గొణిగినా స్కూల్లో పెద్ద ప్లే గ్రౌండ్‌లో ఆడుకోవడం వాడికి బాగా నచ్చింది. ఇక పాపం రఘుకి కంపెనీ బస్ ఆగే బస్ స్టాప్ రెండు కిలోమీటర్లు నడిస్తే గానీ రాదు. కానీ బస్‌లో ప్రయాణం చేసే మొత్తం సమయం తగ్గుతుంది. సురేఖ ఒప్పుకుంటే స్కూటర్లో వెళ్ళొచ్చన్నాను. గానీ వాడు సురేఖని అడగలేదు. ఓ గంట ముందుగా బయల్దేరి 'బ్రిస్క్‌వాక్' చేస్తూ వెళ్లిపోతున్నాడు. నెల రోజుల్లోనే వాడి చిరుబొజ్జ కరిగిపోయి చురుగ్గా అయ్యాడు. సురేఖే దేవుడి గూట్లో ఉన్న వాహన దేవతల బొమ్మలన్నీ తీసి షోకేస్‌లో సర్దింది ఓరోజు. అనుకున్న దానికన్నా బాగా ఆలస్యం అయినా తృప్తిగా బయల్దేరాం ఊరికి. వెళ్లే ముందు బట్టలు పెట్టి మా కాళ్లకి నమస్కరిస్తూ..'' మామయ్యగారూ! మీరు చెప్పినవన్నీ విన్నాను కదా! నేను అడిగినది మీరు ఒప్పుకోవాలి?'' అంది. ''తప్పకుండా! అడుగమ్మా'' అన్నాను. ''ప్రతి ఆరు నెలలకీ మీరు ఇక్కడికి వచ్చి మాతో పదిరోజులుండి వెళ్లాలి. ప్రతివేసవికీ మేమూ మీ ఊరు వస్తాం.'' అంది. పిల్లా పీచులేని మాకు అంతకంటే ఆనందమేముంటుంది? సంతోషంగా ఒప్పుకుని బండెక్కాము.

***

''ఎదుగూ బొదుగూలేని మన ఊరయితే ఇలా ఉంది గానీ పల్లెలు పట్టణాలవుతున్నాయి. పట్టణాలు మహానగరాలవుతున్నాయి. అలాంటిది ఆ కాలనీ ఎన్నాళ్లు అలా ఉంటుంది? అక్కడా ట్రాఫిక్ పెరగదా? ఎవడో ఒకడు దేనికిందోపడి కాలో చెయ్యో విరక్కొట్టుకుంటే మళ్ళీ సురేఖకి భయం జబ్బు పట్టుకుంటుందేమో..'' అని ఇంటికి వచ్చాక మా ఆవిడ స్త్రీ సహజమైన అనుమానాన్ని, మొగుడిపై అపనమ్మకాన్నీ తరచూ వెలిబుచ్చుతూ ఉండేది. దానికి జవాబుగా మరోమూడు నెలల్లో ఉత్తరం వచ్చింది సరేఖ దగ్గర్నుంచి. పూజ్యులైన మార్గదర్శకులకి అంటూ మొదలుపెట్టింది. తను ఈమధ్య 'రక్ష' అనే స్వచ్ఛంద సంస్థలో మెంబరయిందిట. తన దృక్పథం చాలా మారిందిట. ప్రాక్టికల్‌గా ఆలోచిస్తోందిట. ఆ సంస్థ తరపున విద్యార్థులకి కౌన్సిలింగ్ చెయ్యడం, ట్రాఫిక్ పోలీసుల సహాయంతో ట్రాఫిక్ అవగాహనా వారోత్సవాలు నిర్వహించడం, మురికివాడల్లో పిల్లలకి చదువుచెప్పడం ఒకటేమిటి సంస్థ ప్రతీకార్యక్రమంలో చురుగ్గాపాల్గొంటోందిట.

వృద్ధాశ్రమంలో పనిచేయడం వల్ల మరణం అంటే ఉన్న భయం తగ్గిందట. సుమంత్ చదివే స్కూల్లో పిల్లలని ఉద్దేశించి మాట్లాడినపుడు వాడు అవాక్కయిపోయాడట. అంతకంటే ఆశ్చర్యం ఒక టూ వీలర్ కొనుక్కుని నడపడం నేర్చుకుంటోందిట. సమయం కలిసి వస్తుందని. ఆ కాలనీ మాత్రం వదలదట. అక్కడికి వెళ్ళాకే తను మారిందట. అన్నీరాసి 'మనం కలుసుకుని ఆరునెలలయిపోయింది. ఈ వేసవి మీతో గడపడానికి వస్తున్నాం. రఘుకి సెలవు దొరకగానే రాస్తాను.' అని ముగించింది. ఉత్తరం చదువుతూ రంగులు మారిన ఆవిడ మొహాన్ని చూస్తూ శ్రీకృష్ణ పరమాత్మునిలా చిరునవ్వు నవ్వాను. అర్జునుడిలా రెండు చేతులూ జోడించి, తల వంచింది ఆవిడ.

